క్లుప్తంగా

బొబ్బిల్లంకలో ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: బొబ్బిల్లంక సచివాలయంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 552 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలందించారు. గ్రామంలో మంచంపై ఉన్న రోగుల ఇంటికి నేరుగా వెళ్లి వైద్య సేవలు అందించారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా ఇచ్చారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌వీ లక్ష్మి, హెచ్‌సీ స్వామి, ఏఎస్ఎం జ్యోతి, ఆశ వర్కర్లు సూర్యకుమారి, వీరలక్ష్మి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసన్న కుమార్

సీతానగరం: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బొబ్బిల్లంకలో మంగళవారం 70 మందికి డాక్టర్ ప్రసన్న కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 20 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఆరుగురికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సరిహద్దు రాళ్ల ఏర్పాటు



సరిహద్దు వివరాలు తెలిపే రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభాష్

పెదపూడి: జగనన్న భూరక్ష, భూసర్వే ప్రకారం సర్వే పూర్తయిన గ్రామాల్లోని పొలాల సరిహద్దుల్లో నిబంధనల ప్రకారం కొలత, పునాది రాళ్లు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ టి.సుభాష్ తెలిపారు. ఆయన గండ్రేడు, కాండ్రేగుల గ్రామాల్లో మంగళవారం కొలత రాళ్లు ఏర్పాటుచేసే కార్యక్రమం ప్రారంభించారు. సంపర, రాజుపాలెం, కాండ్రేగుల, గండ్రేడు తదితర గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లో వారి భూముల వివరాలు తెలియజేయడానికి ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేసిన రాళ్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

1న మండల పరిషత్ సమావేశం

రంగంపేట: రంగంపేట మండల పరిషత్ సాధారణ సమావేశం మార్చి 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ రిమ్మలపూడి సత్య శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామరాజు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై తమ శాఖల ప్రగతిని వివరించాలని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెదపూడి: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయు మండల నాయకురాలు ఎం.రాజేశ్వరి అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పెదపూడిలో మంగళవారం నిరసన తెలియజేశారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావుకు తమ డిమండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచడంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బలక్ష్మి, రత్నం, మంగయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

సీతానగరం: మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు దుర్వినియోగమైనట్టు సంబంధిత మంత్రిత్వశాఖాధికారికి ఫిర్యాదు చేశానని చిన కొండేపూడికి చెందిన న్యాయవాది చిడిపి నకుల సురేష్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇళ్ల స్థలాల్లో మట్టితో ఫిల్లింగ్ చేశామని చెప్పి రూ.25 కోట్లు దుర్వినియోగం చేశారని గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ సంజయ్ కుమార్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

ఆక్రమణల చెరలో చెరువులు

- యథేచ్ఛగా కబ్జా
- ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు



చక్రద్వారబంధంలో ఆక్రమణకు గురైన ఊర చెరువు

రాజానగరం: గ్రామాలు, నగరాలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో మన పూర్వీకులు ముందుచూపుతో వ్యవహరించారనేది జగమెరిగిన వాస్తవం. అయితే ఆధునీకరణ పేరుతో నేటితరం అందమైన భవంతులు నిర్మిస్తున్నారు గానీ, జన జీవనానికి సరిపడే విధంగా మౌలిక సదుపాయాలను మాత్రం సమకూర్చలేక పోతున్నారు. కనీసం ఇప్పటి వరకు మన పూర్వీకులు ఏర్పాటు చేసిన చెరువులు తదితర వాటిని కూడా కాపాడుకోలేని దుస్థితిలో నేటి ఆధునిక సమాజం పయనిస్తోంది. బలవంతుడిదే రాజ్యమన్నట్టుగా పూర్వీకులు ఏర్పాటు చేసిన వసతులను కొందరు ప్రబుద్ధులు కబళించి, ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారు.

చెరువులు కనుమరుగు

మన పూర్వీకులు ఎంతో ఆలోచించి, భావితరాలకు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని నివాస ప్రాంతాలలో మురుగు నీరు, ముంపునీరు దిగువ ప్రాంతాలకు సులువుగా పోయేందుకు, మంచినీటి, సాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలుగా గ్రామీణ, నగర ప్రాంతాలలో చెరువులను ఏర్పాటు చేశారు. ఆధునిక కాలంలో జనాభా సంఖ్యకనుగుణంగా వాటి సంఖ్య పెరగకపోగా ఉన్నవాటినే కబళిస్తున్నారు. గుడులు, గోపురాల పేరుతో కొంతమంది ఆక్రమిస్తుంటే, మరికొందరు పలుకుబడితో కబ్జా చేసేస్తూ, భావితరాలకు సమస్యాత్మక వాతావరణాన్ని ప్రసాదించేలా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే భారీవర్షాలకు అనేక ప్రాంతాలు ముంపు బారిన పడుతూ జనాలు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు అనేకం చూస్తున్నాం. అయినా ఆలోచించే వారే కరువవుతున్నారు.

గుడి పేరుతో కబ్జా

చక్రద్వారబంధంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల వద్ద జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డును ఆనుకుని ఉన్న ఊర చెరువును కొంతమంది వ్యక్తులు రాత్రి రాత్రి కబ్జా చేశారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో పడమర వైపు భాగాన్ని (రెండు ఎకరాల వరకు) మట్టితో పూడ్చేశారు. గ్రామంలో ఉన్న రెండు వర్గాలలో ఒక వర్గం ఈ పనికి పాల్పడితే రెండో వర్గం వ్యతిరేకిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై పంచాయతీ అధికారులు ఆక్రమణదారులను ప్రశ్నిస్తే, గుడి కోసం చేశామంటూ దర్పాన్ని ప్రదర్శించడం విశేషం. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ని వివరణ కోరగా విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లానన్నారు.

నియోజకవర్గంలో 34 చెరువుల ఆక్రమణ

నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో శివారు గ్రామాలతో పాటు 72 గ్రామాలుంటే 218 చిన్న, పెద్ద చెరువులున్నాయి. వీటిలో ఇప్పటికే 34 చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. ఇటువంటి ఆక్రమణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామాలలో చెరువులు, పుంతలు మున్నగు వాటి ఆక్రమణలను నివారించుటలో పంచాయతీ కార్యదర్శికి అధికారం ఉంది. ఇందుకుగాను 2011లో ప్రభుత్వం 188 జీఓను జారీ చేసింది. ఇటీవల సుప్రీంకోర్టు కూడా చెరువులను, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని, ఆక్రమణలకు గురైతే తగిన చర్యలు తీసుకుని, వాటిని పరిరక్షించాలని తీర్పు ఇచ్చింది. అయినా ప్రభుత్వ జీఓలు, కోర్టు తీర్పులు ఆచరణలో కానరావడం లేదు.

విచారణ జరపాలి

గ్రామ ఆవిర్భావం నుంచి మంచినీటి చెరువుగా ఉన్న ఊర చెరువును కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే కబ్జా చేశారు. అదేమంటే గుడి కోసం చేశామంటున్నారు. నిజంగా వారికి గుడి కట్టాలనే ఆలోచన ఉంటే గ్రామంలో పంచాయతీ స్థలాలు అనేకం ఉన్నాయి. వాటిలో జనామోదం మేరకు ఎక్కడైనా కట్టవచ్చు. కానీ ఉన్న చెరువును పూడ్చేసి, గుడి కట్టవలసిన పని లేదు. ఈ చర్య వలన ముంపు నీటి సమస్య ఉత్పన్నమవుతుంది. ఇప్పటికే అపార్టుమెంటు కల్చర్‌తో గ్రామంలో ముంపునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుని, ఆక్రమణల బారినుండి చెరువును కాపాడాలి.

– బావిరెడ్డి సత్యనారాయణ, చక్రద్వారబంధం

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన రజనీ



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిసిన రజనీ

అనపర్తి: అన్నవరం దేవస్థానం బోర్డు పాలక మండలి సభ్యురాలుగా ఇటీవల నియమితులైన తాడి రజనీ హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు ఉన్నత పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బీవీఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవ ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా అమ్మ భాషలో ప్రావీణ్యత అవసరమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

బస్టాండ్ల అభివృద్ధికి సహకరించండి



ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఆర్టీసీ చైర్మన్‌కు వినతి

రాజానగరం: నియోజకవర్గంలోని కోరుకొండ, దివాన్ చెరువు, రాజానగరం బస్టాండ్‌లను ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలో ఆయనను కలిసి, అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సమీపంలోని బస్టాండ్‌ను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బస్టాండ్ అభివృద్ధికి సుమారు రూ.75 లక్షలు అవసరమన్నారు. దివాన్ చెరువులో ప్రయాణికుల అవసరార్థం బస్టాండ్‌ను నిర్మించాల్సి ఉందన్నారు. రాజానగరంలోని బస్టాండ్‌లో మరుగు సదుపాయం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా బస్టాండ్‌ను ఆధునీకరించాలన్నారు. కాగా.. ఈ ప్రతిపాదనలకు ఆర్టీసీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అర్చకులు మంగళవారం వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన చేశారు.

నేడు కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



తొస్సిపూడిలో కనకదుర్గమ్మ

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ తల్లి ఆలయ 32వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన, సాయంత్రం జాతర, బాణసంచా కాల్పులు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

సామూహికంగా ఎలుకల్ని నిర్మూలించాలి

బిక్కవోలు: రైతులంతా సామూహికంగా ఎలుకల్ని నిర్మూలించాలని ఎంపీటీసీ సభ్యులు బండారు శివ అన్నారు. మంగళవారం మండలంలోని ఊలపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందించే ఎలుకల నివారణ మందును పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఎలుకల నివారణ మందును రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు బండారు శివ అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శామ్యూల్ జాన్, సొసైటీ అధ్యక్షుడు గుండ్రాల విజయ శేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట

గోకవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం పక్షపాతి అని వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తరువాత బీసీలకు పెద్ద పీట వేశారని గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. గోకవరంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు 18 స్థానాలకు గాను 14 స్థానాలు బీసీ, ఎస్సీలకు కేటాయించడం అభినందనీయని అందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలంటే బ్యాక్వార్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ అని మరోసారి రుజువు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, చిట్టిబాబు, నాయకులు తోలేటి రాంప్రసాద్, శింబోతుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కులను సాధించగలం

రంగంపేట: ఐక్యతతోనే హక్కులు సాధించగలమని మండల బీసీ నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, గురజారపు వీరభద్రరావులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ముకుందవరం గ్రామంలో జరిగిన బీసీ సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీల్లో ఐక్యత లేకపోవడం వల్ల రాజకీయంగా, సామాజికంగా సరైన న్యాయం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో రంగంపేట మండల బీసీ సంఘం అధ్యక్షుడు కేతా సత్తిబాబు, భీమార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత



గీతాలను ఆలపిస్తున్న నన్నయ బీఈడీ విద్యార్థులు

రాజానగరం: మాతృభాషను గౌరవిస్తూ, పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు అన్నారు. కేరళలోని విద్యాభ్యాస్ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఆన్‌లైన్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. యునెస్కో పర్యవేక్షణలో ఏటా ఫిబ్రవరి 21న నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దక్షిణ భారతదేశంలో ఈ ఏడాది నాలుగు బీఈడీ కళాశాలలను ఎంపిక చేశారని, వాటిలో నన్నయ ఒకటన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన పి.నికిత, ఇందు భార్గవి, తులసీబాయి, హర్షప్రియ పాల్గొని మాతృభాష గొప్పతనాన్ని, విశిష్టతను తెలియజేసేలా తెలుగు సాహిత్య జానపద పాటలను ఆలపించారు. అధ్యాపకులు డాక్టర్ వి.రామకృష్ణ, డాక్టర్ ఆర్.సాంబశివరావు, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, డాక్టర్ జి.ఎలీషాబాబు, డాక్టర్ జె.రాజామణి, డాక్టర్ ఎస్.సుజాత, డాక్టర్ ఆర్ఎస్‌వీ దొర, రాజ రాజేశ్వరీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాల అందజేత



ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఉన్నత పాఠశాల వద్ద కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. మంగళవారం బలభద్రపురం ఉన్నత పాఠశాలలో ఐటీసీ సౌజన్యంతో ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ మేళా నిర్వహించారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.చెల్లారావు, టీం హెడ్ లోవరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్, టీం లీడర్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపవాస ప్రార్థనలు



కోటికేశవరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

మధురపూడి: ఏసుక్రీస్తు శ్రమలను అనుభవించి, శిలువపై మరణించిన కాలాన్ని పురస్కరించుకుని క్రైస్తవులందరూ 40 రోజుల పాటు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇవి బుధవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకూ జరగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలతో పాటు ప్రసంగాలుంటాయి. కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో లూథరన్, ఆర్‌సీఎం మిషనరీలకు చెందిన వందల చర్చిల్లో ప్రార్థనలు జరుగుతాయి. 40 రోజుల ప్రార్థనల్లో క్రైస్తవులందరూ భక్తి శ్రద్ధలతో పాల్గొంటారు. కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలోని సెయింట్ పాల్స్ లూథరన్, కోరుకొండలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. శ్రమకాలం 40 రోజులకు ప్రారంభంగా భస్మ బుధవారం పండగ నిర్వహిస్తారు. సంబంధిత పాస్టర్లు ప్రార్థనలు చేసి, అందరికీ భస్మాన్ని (బూడిద)ను పంచిపెడతారు. గత సంవత్సరం మట్టల ఆదివారం రోజున ప్రదర్శనలు చేసిన వాటిని కాల్చి బూడిద చేస్తారు. ఈ బూడిదను అందరికీ పంపిణీ చేస్తారు. శ్రమకాలానికి సన్నద్ధమవుతూ క్రైస్తవులు నుదిటపై బూడిదను పూసుకుంటారు. ఏప్రిల్ 7న గుడ్‌ఫ్రైడే, 9వ తేదీన ఈస్టర్ పండగలు నిర్వహిస్తారు.

జగన్ ప్రభుత్వంలో బీసీలకు గుర్తింపు



కుడుపూడి సూర్యనారాయణరావును సత్కరిస్తున్న జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు

మధురపూడి: రాష్ట్రంలో బీసీలను గుర్తించి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది జగనన్న ప్రభుత్వమేనని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థి కుడుపూడి సూర్యనారాయణరావును మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. అనంతరం కోరుకొండలో విలేకర్లతో మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన కుడుపూడి సూర్యనారాయణరావును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం సంతోషకరంగా ఉందన్నారు.

మహిళా దినోత్సవ పోటీలు

రాజానగరం: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్‌లో మహిళలు, బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నామని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరావు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 83282 29133, 95053 52866 నంబర్లకు ఫోన్ చేసి, పోటీల వివరాలు, ఎప్పుడు, ఎక్కడ నిర్వహించేదీ తెలుసుకోవచ్చన్నారు.

రక్తహీనతపై అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రక్తహీనతపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, ఎంఈవో కె.స్వామినాయక్, సీహెచ్‌వో పి.రాధాకృష్ణ, ఏపీఎం మహాలక్ష్మి పాల్గొన్నారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లలో 10 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయసుగల ఆడపిల్లలకు, 49 ఏళ్ల వరకూ గర్భిణులు, బాలింతలకు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన, తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి గ్రామ సచివాలయాల్లో సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి గురువారం స్కూళ్లలో, బుధ, శనివారాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు ఎస్.లక్ష్మి, కె.సుధాకర్, సూర్యకుమారి, దైవకృప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్

గోకవరం: వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌లో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థినులకు పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించారు. రూరల్ హార్టీకల్చర్ వర్క్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా రంపయేర్రంపాలెం వద్ద కాక రంపచోడవరం పెందిరి మామిడి తోటల్లో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ మంగళవారం విద్యార్థినులకు, స్థానిక రైతులకు తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థినులు పూజిత, ఇషిత, యోగ్యత, తేజస్విని, ప్రణతి, అనిత, బ్లెస్సీ, ఎస్తేర్, సౌమ్య, భవానీ, నీరజాక్షి తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: నూతన పెన్షన్ విధానం రద్దు చేసి, పాత విధానాన్ని అమలు చేయాలంటూ రైల్వే మజ్దూర్ యూనియన్ వివిధ విభాగాల కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసరెడ్డి, తిరుమలదేవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ఆవరణలోని రిజర్వేషన్ కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనవరి 2004 నుంచి జాయిన్ అయిన ఉద్యోగుల్లో రిటైర్ అయినవాళ్లకు నెలకు రూ.4000 లోపు పెన్షన్ వస్తే, పాత విధానంలో రూ.40 వేల వరకు వస్తోందన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేసేవారికే 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓటు వేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. పాత పెన్షన్ విధానం సాధించే కార్యాచరణలో భాగంగా పార్లమెంట్ వర్షాకాలం సమావేశాల్లో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంతో పాటు సెప్టెంబరు 18న భారత్ బంద్ నిర్వహిస్తామన్నారు.

వైభవంగా చక్రస్నానం

సీటీఆర్ఐ: మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగా మంగళవారం మార్కండేయేశ్వరస్వామికి స్థానిక మార్కండేయఘాట్‌లో చక్రస్నానం నిర్వహించారు. రాత్రి పుష్పార్చనతో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాగోలు శ్రీనివాస్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య రక్ష

మధురపూడి: ఆయుష్మాన్ భారత్ కింద పేదలు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆధార్ ఈ–కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలని రాజమహేంద్రవరం డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి పి.వీణాదేవి స్పష్టం చేశారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం కోరుకొండ, గోకవరం మండలాల సచివాలయం, ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బందికి ఆయుష్మాన్ భారత్ నమోదు ప్రక్రియపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎల్‌డీఓ పి.వీణాదేవి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కింద పోర్టల్‌లో అందుబాటులో ఉన్న కుటుంబాల ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు. తద్వారా ఆరోగ్యభద్రత కల్పించడం సాధ్యమవుతోందన్నారు. కోరుకొండ ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోకవరం ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ రవిచంద్ర, కోటికేశవరం పీహెచ్‌సీ డాక్టర్ పుణ్యశాంతి, సచివాలయం కార్యదర్శులు, ఏఎన్ఎం, వలంటీర్లు పాల్గొన్నారు.